29012025-DIS-04_Layout 1 1/29/2025 2:13 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

పెట్టుబడులపై కట్టుకథలు

వెనుకటికి తుపాకీ రాముడు, పిట్టల దొర వంటి వేషాలు వేసే టోళ్లు ఏతులతో నవ్వించేటోళ్లు. అలా చేయడం కేవలం వినోదం పంచడానికే. మరి సీఎం స్థాయి వ్యక్తి ఇలాంటి మాటలు మాట్లాడితే ఏమనాలి? దావోస్‌లో రాష్ట్రానికి సేకరించిన పెట్టుబడుల లెక్కలు ఇంతింతై వటుడింతై అని ఆకాశాన్ని తాకడం వింతల్లోకెల్లా వింత. రూ.1.78 లక్షల కోట్ల పైచిలుకు పెట్టుబడులపై ఒప్పందం కుదిరిందని, వీటి ద్వారా 49,500 మందికి ఉపాధి లభిస్తుందని సీఎంవో ప్రకటించింది. ఇందులో దిగ్గజ సంస్థ అమెజాన్ రూ.60 వేల కోట్లు, సన్ పెట్రో కెమికల్స్ రూ.45,500 కోట్ల పెట్టుబడులకు అంగీకరించాయని తెలిపింది. సీఎం రేవంత్ భారీగా పెట్టుబడులు సాధించుకువచ్చారని, అది చూసి బీఆర్ఎస్ నాయకులకు కడుపు మంట కలుగుతున్నదని హోర్డింగులు పెట్టుకోవడం హాస్యాస్పదం. నిజంగా ఆ స్థాయి పెట్టుబడులు తేగలిగితే సంతోషించేది తెలంగాణను సాధించిన పార్టీ యేనన్నది నిర్వివాదాంశం. సీఎం చెప్తున్నట్టుగా 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తే ఆయనకు తాము సన్మానం చేస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చురక వేయడం గమనార్హం.

మేఘా కంపెనీతో రూ.15 వేల కోట్ల ఒప్పందం కుదిరిందని చెప్పుకొంటున్నారు. స్కైరూట్ బీఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించిన టీ హబ్‌లో ఊపిరి పోసుకున్న కంపెనీయే. మరో హైదరాబాదీ కంపెనీ కంట్రోల్ ఎస్‌తో కూడా ఒప్పందం కుదుర్చుకున్నామంటున్నారు. ఈ మూడు కంపెనీలు కలిపి రూ.25,500 కోట్ల పెట్టుబడులు పెడతాయంటున్నారు. హైదరాబాద్‌లో ఉన్న కంపెనీలతో వేల కిలోమీటర్ల దూరంలోని దావోస్‌కు పోయి ఒప్పందం కుదుర్చుకోవడం ఏమిటో? ఇవి విదేశీ పెట్టుబడుల కిందకు వస్తాయా? అనేది ప్రశ్న. గత ఏడాది వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు సందర్భంగా రూ.40 వేల కోట్లకు పైగా ఒప్పందాలు కుదిరినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం టాంటాం వేసుకున్నది. 18 కంపెనీలతో ఎంవోయూలు కుదిరితే ఒక్కటీ వెలుగు చూడలేదు. ఒక్క ఉద్యోగమూ రాలేదు. ఈ సారి సంఖ్యను పెంచి చెప్తున్న ప్పటికీ అందులో అసలు సిసలైన ఒప్పందాలు ఎన్ని? పాత వాటి విస్తరణలు ఎన్ని? అనేది ప్రశ్న. దావోస్ ఒప్పందాలు ఆసక్తి ప్రకటనలు మాత్రమేనని కాంగ్రెస్ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గతంలో చెప్పిన మాటలు ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. బీఆర్ఎస్ డిమాండ్ చేస్తున్నట్టుగా శ్వేతపత్రం విడుదల చేస్తే 'విదేశీ పెట్టుబడుల' అసలు రంగు బయటపడుతుంది.

పెట్టుబడుల గురించి ప్రకటనలు గుప్పించి ప్రచారార్భాటం చేసుకోవడం సరే.. అవి కార్యరూపం దాల్చేలా చేయాల్సిన బాధ్యత కూడా తనపై ఉన్నదని సర్కారు గుర్తించాలి. తెలంగాణ ఇమేజ్ బీఆర్ఎస్ హయాంలో పెరిగిందన్నది వాస్తవం. ఫలితంగా పెట్టుబడుల ప్రవాహం ఉధృతమైందన్నదీ వాస్తవమే. కేసీఆర్ ప్రభుత్వం ఫాక్స్‌కాన్, కిటెక్స్ వంటి కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకోవడమే కాకుండా అవి సాకారమయ్యేలా చర్యలు తీసుకోవడమూ తెలిసిందే. సీఎం రేవంత్ కూడా అనవసరమైన అట్టహాసాలు మాని అదే దారిలో వెళ్తే రాష్ట్రానికి నిజంగా మేలు జరుగుతుంది.

దరఖాస్తులేంది...! దండాలేంది?

...ఆ రణరంగమేంది?

పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

చాట్లో తవుడు పోసి కుక్కలకు కొట్లాట పెట్టడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య. ఎగవేతలు, ఎంపికలే ఎజెండాగా, కోతలే కొలమానంగా, దబాయింపే రాజకీయంగా, అబద్ధాల ప్రచారాలే అసలు సిసలు అస్త్రాలుగా ఏడాది నుంచి కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ పాలనలో మళ్లీ దరఖాస్తుల దందానే నడుస్తున్నది. ఒక్క దరఖాస్తు లేకుండా, ఒక్క దస్తర్ లేకుండా, దండాలు పెట్టకున్నా ప్రభుత్వ పథకాలు నడి ఇంట్లోకి నడిచొచ్చిన కేసీఆర్ స్వర్ణయుగపు పాలనకు, ఏడాది రేవంత్ పాలనకు ఇప్పుడు గ్రామాల్లో పోలిక మొదలైంది. ఇటీవలి గ్రామసభల సాక్షిగా కేసీఆర్ మానవీయ పాలనపై రచ్చ బండల్లో చర్చకు దారితీసింది. 'నాడు చూడు.. నేడు చూడు' అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనయని గ్రామసభల సాక్షిగా పథకాల కోతకు, ఎగవేతకు గురైన బాధితులే ఏకరువు పెట్టిన దృశ్యాలూ చూస్తున్నాం.

75 ఏండ్ల స్వాతంత్ర్య భారతదేశంలో దేశాన్ని పేదరికంలోకి నెట్టి, పేదరికాన్ని పెంచిపోషించిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో మళ్లీ ఆ పాత రోజులనే తెస్తున్నది. పథకాల పేరిట పేద ప్రజల మధ్య చిచ్చుపెట్టి మరీ పబ్బం గడుపుకొంటున్నది. ఇందిరమ్మ రాజ్యం పేరిట మరోసారి దరఖాస్తులు, దండాలు, దస్తర్లకు ఆ పార్టీ మళ్లీ తెరలేపింది. అంటే 'జీ హుజూర్' అని దండం పెట్టిన వాళ్లకే సర్కారీ పథకాలు అందుతాయని చెప్పకనే చెప్తున్నది. ఇటీవల 21 నుంచి 24వ తేదీ వరకు జరిగిన గ్రామసభల నిర్వహణ, వాటి తీరు తెన్నులను, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతల వ్యాఖ్యలను నిశితంగా గమనిస్తే తమ కార్యకర్తలకు మాత్రమే ఆ పథకాలు వర్తిస్తాయని తేటతెల్లమవుతున్నది. ఓట్ల కోసం 4 కోట్ల మందిని నయవంచనకు గురిచేసి ప్రజలను ఏమార్చారని స్పష్టంగా తేలిపోయింది. కేసీఆర్ తన పదేండ్ల పాలనా కాలంలో ప్రతీ సంక్షేమ పథకాన్ని మానవీయ కోణంలోనే ప్రవేశపెట్టి అమలుచేశారు.

దేశంలో నంబర్ వన్ పథకం రైతుబంధు. ఈ పథకాన్ని ఏకంగా ప్రధాని నరేంద్ర మోదీ కాపీ కొట్టిన వైనం అందరికీ తెలిసిందే. ఇక్కడ అమలు జరుగుతున్న 'కంటి వెలుగు' పథకం ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో అమలవుతున్నది. 13.9 లక్షల మంది మహిళలకు కేసీఆర్ కిట్‌తో ఎలాంటి దరఖాస్తు లేకుండా భరోసా ఇచ్చి అమలుచేశారు. సంక్షేమం, అభివృద్ధిని జోడెడ్లుగా పరిగణించి 60 ఏండ్ల సమైక్య పాలకులను మరిపిస్తూ తెలంగాణలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు అంటే ఓట్ల రాజకీయం కాదని, ప్రజల ఆర్థిక, సామాజిక, జీవన స్థితిగతులు మెరుగుపరచాలన్న ఏకైక లక్ష్యంతో అన్నివర్గాలకు ఎలాంటి ప్రతిపాదనలు, దరఖాస్తు లేకుండా అమలు చేశారు. వికలాంగులకు పింఛన్ ఇచ్చినా, పింఛన్ పెంచినా అది కేసీఆర్ ఔదార్యానికే చెల్లింది. విదేశాల్లో చదువుకుంటే రూ.20 లక్షలు ఇవ్వడం అంటే కేసీఆర్ మార్క్ పాలనకు నేటికి ఎవ్వరూ సాటి లేరు. ఇలా చెప్పుకొంటే పుట్టబోయే పసిగుడ్డు నుంచి పండు ముదుసలి వరకూ ఏదో ఒక రూపంలో కేసీఆర్ మార్క్ పథకం కనిపించేది. కానీ, నేడు ఆ పథకాలకు పాతరేసి హామీల జాతరతో ఊరేగుతూ పబ్బం గడుపుతున్న ఘటనలు నిత్యకృత్యమవుతున్నాయి.

ఒక్కసారి రైతుబంధు విషయానికి వస్తే వరుసగా 12 సీజన్లకు దరఖాస్తులు పెట్టే అవసరమే లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లో రూ.73 వేల కోట్ల నిధులను జమచేశారు. కేసీఆర్ కిట్, దళితబంధు, బీసీ బంధులతో సహా కేసీఆర్ ప్రవేశపెట్టిన ఏ పథకానికీ దరఖాస్తు స్వీకరించలేదు. దండాలు పెట్టించుకోలేదు.

కానీ, నేడు కాంగ్రెస్ పార్టీ కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలకే పేర్లు మార్చి, ఆ నిధులు కూడా అరకొరగా ఇస్తున్నారు. వానకాలం రైతుబంధు, యాసంగి రైతుబంధు కలిపి ఎకరానికి రూ.15 వేలు బకాయిపడ్డారు. అధికారంలోకి వస్తే ఏటా ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని, కౌలు రైతులకూ కలిపి ఇస్తామని, ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, రూ.500 బోనస్ ఇస్తామని వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీతో ఊకదంపుడు ఉపన్యాసాలిప్పించి ఓట్లు దండుకున్నారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో 6 గ్యారెంటీలు, 420 హామీలను తుంగలో తొక్కిన రేవంత్ ప్రభుత్వంపై ఇవాళ ప్రజలు గ్రామసభల సాక్షిగా తిరగబడుతున్నారు. సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు లేకుండా జరిగిన గ్రామసభల్లో ఎమ్మెల్యేలు చెప్పిందే వేదం. వారు చేసిందే చట్టం.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజాపాలన పేరిట కొత్తగా దరఖాస్తులు స్వీకరించింది. ఇంటింటి సర్వేలూ నిర్వహించింది. ప్రజాపాలన దరఖాస్తుల్లో అన్ని పథకాలకూ ఒకే దరఖాస్తు అని అభయహస్తం హామీలకు 1.05 కోట్ల దరఖాస్తులు స్వీకరించారు. ఇతర అంశాలకు సంబంధించి మరో 20 లక్షల దరఖాస్తులు వచ్చాయని స్వయంగా సీఎం రేవంత్ ఓ సమీక్షలో స్పష్టం చేశారు. అంతేకాదు, 6 గ్యారెంటీల అమలుకు క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేసినట్టుగా వెల్లడించారు. కానీ, ఇవ్వాళ 14 నెలలు కావస్తున్నా ఆరు గ్యారెంటీల ఊసే లేకపోగా, పథకాలకు మళ్లీ దరఖాస్తులు స్వీకరిస్తుండటం హాస్యాస్పదం.

అంతేకాదు, ఇటీవల కులగణన సమగ్ర సర్వే కోసం రాష్ట్రంలోని 1.17 కోట్లకు పైగా ఇండ్లను గుర్తించి మొదటి దశలో వాటికి స్టిక్కర్లు అంటించారు. రెండో దశలో ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యుల వివరాలను సేకరించారు. మొత్తం 8 పేజీల్లో 56 అంశాలకు సంబంధించి 75 ప్రశ్నల ద్వారా సమాచారం సేకరించారు. ఇందులో ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య ఇలా అన్ని అంశాలకు సంబంధించిన ప్రశ్నలే ఉన్నాయి.

ఒకరకంగా చెప్పాలంటే ప్రతి సమాచారం ప్రభుత్వం సేకరించింది. బ్యాంకు ఖాతా, పాసుబుక్ ఉందా, లేదా? ఇలాంటి సమాచారం కూడా ప్రభుత్వం సేకరించి పెట్టింది. ప్రభుత్వ పథకాల అమలుకోసం సమాచారం చెప్పాల్సిందేనని పట్టుబట్టారు. ఇక ఇవి చాలవన్నట్టుగా తాజాగా నిర్వహించిన గ్రామసభల్లోనూ రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం మళ్లీ దరఖాస్తులు తీసుకున్నారు. అంటే ఒక్క పథకం కోసం ఎన్నిసార్లు దరఖాస్తులు చేయాలి? ఎన్నిసార్లు దండాలు పెట్టాలన్నది ఇక్కడ చర్చ.

పథకం అమలు చేయదలుచుకుంటే ఏ పథకం కింద ఎంత మంది లబ్ధిదారులు ఉన్నారో ప్రభుత్వం దగ్గర సమాచారం ఉన్నది. నిధుల వెసులుబాటును చూసుకొని పథకాలను వర్తింపజేయవచ్చు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అలా చేయకుండా ప్రజాగ్రహం పెల్లుబుకడంతో మాట మార్చి, తూతూ మంత్రంగా గ్రామసభలు జరిపి చేతులు దులుపుకొంటున్నది.

ఇక ఏడాది నుంచి ప్రజలు సర్కారు పథకాల కోసం సర్కస్ ఫీట్లు వేశారు. రాష్ట్రంలో 12,560 గ్రామ పంచాయతీలుంటే అందులో ఒకే ఒక్కరోజు 563 పంచాయతీలను ఎంపిక చేసి 4 పథకాలను అమలుచేస్తున్నట్టు ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలు గాలికి వదిలిన నేతలు గ్రామసభలు పూర్తవ్వగానే అందరికి అన్ని పథకాలు ఇవ్వాల్సింది పోయి కోతలు పెట్టి, ఎగ్గొట్టి కొసిరి కొసిరి ఇస్తున్నారు.

ఈ 4 పథకాల అమలుకు కూడా మార్చి 31 వరకు గడువు కావాలని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే డెడ్ లైన్ విధించుకున్నారు. అంటే సర్కారు పథకాలు అమలు కావాలంటే ఏడాదిన్నర సమయం కావాలన్న మాట. రాష్ట్రంలో ఏక కాలంలో రూ.2 లక్షల రుణ మాఫీ అని ఊదరగొట్టి కేవలం 40 శాతం మంది రైతులకే ఆ పథకాన్ని వర్తింపచేసి చేతులు దులుపుకొన్నట్టే నాలుగు పథకాలను కూడా ఎంపిక చేసిన గ్రామాల్లో అరకొరగా అమలుచేసి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసింది.

కానీ కాంగ్రెస్ పార్టీకి పథకాలిచ్చే ఉద్దేశం లేదనడానికి వానకాలంలో ఎగ్గొట్టిన రైతుబంధు పథకమే ప్రత్యక్ష తార్కాణం. 6 గ్యారెంటీల హామీల్లో ఒకట్టైన కల్యాణలక్ష్మికి నిధులు బంద్ చేయడమే కాక తులం బంగారం ఊసే ఎత్తడం లేదు. కేసీఆర్ కిట్ నామ రూపాల్లేకుండా పోయింది. గొర్రెలు, బర్రెలు, చేప పిల్లల ఉత్పత్తికి బ్రేకులు వేశారు. విదేశీ విద్యా నిధిని పూర్తిగా నిలుపుదల చేశారు. నిజంగా ఈ ప్రభుత్వం పథకాలను అమలు చేయాలనుకుంటే ఇన్ని దరఖాస్తులెందుకు, ఇన్నిసార్లు తిప్పించుకోవడం ఎందుకన్న ప్రశ్న రాకమానదు. అయితే, అందరిని కొన్నిసార్లు మోసగించవచ్చు. కొందరిని అన్నిసార్లూ మోసగించవచ్చు.. కానీ అందరినీ, అన్నిసార్లూ మోసగించలేం అన్నది మాత్రం నిజం.

(వ్యాసకర్త: శాసనమండలి సభ్యులు)

ఇక ఏడాది నుంచి ప్రజలు సర్కారు పథకాల కోసం సర్కస్ ఫీట్లు వేశారు. రాష్ట్రంలో 12,560 గ్రామ పంచాయతీలుంటే అందులో ఒకే ఒక్కరోజు 563 పంచాయతీలను ఎంపిక చేసి 4 పథకాలను అమలుచేస్తున్నట్టు ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలు గాలికివదిలిన నేతలు గ్రామసభలు పూర్తవ్వగానే అందరికి అన్ని పథకాలు ఇవ్వాల్సింది పోయి కోతలు పెట్టి, ఎగ్గొట్టి కొసిరి కొసిరి ఇస్తున్నారు.

పాడి పంటలా? పరిశ్రమలా?

నర్సన్ బద్రి
94401 28169

'పల్లెటూరు మన భాగ్యసీమరా.. పాడి పంటలకు లోటు లేదురా..' అనే పాట పాతబడిపోయింది. భాగ్యనగరం చుట్టూ పచ్చదనం పోయి పొగ గొట్టాలతో ఆకాశం కారుమబ్బుల్లో చిక్కుకునేలా ఉంది. పారిశ్రామికీకరణ ఫలితంగా రైతు పడే బాధలను 'దో బిఘా జమీన్' సినిమాలో బిమల్ రాయ్ ఆనాడే చూయించారు. ఫ్యాక్టరీకి తన స్థలం పోకుండా తిప్పలు పడిన రైతుకు చివరికి భంగపాటే మిగులుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ వెళ్లి తెలంగాణలో లక్షాఎనభై వేల కోట్ల రూపాయలతో విలువైన పరిశ్రమల స్థాపనకు ఒప్పందాలు కుదుర్చుకొని వచ్చాక రేపటి తెలంగాణ రూపం గురించి మన రైతులకు అలాంటి భయమే పట్టుకున్నది.

సీఎం రేవంత్ తీసుకువచ్చిన ఒప్పందాలకు సరిపడా నేల ప్రభుత్వం దగ్గర ఉన్నదా లేక రైతుల పంట పొలాలే ఆయనకు అప్పగించాలా అనేది నేడు ప్రధాన సమస్య. ప్రజల అంగీకారం లేకుండా భూసేకరణ చేయడం చట్టబద్ధం కాదు. ఈ నేపథ్యంలో కొత్తగా తెచ్చిన ఒప్పందాలపై ప్రభుత్వ సంబురం చూస్తుంటే పల్లెలు రణరంగాలు అయ్యేకాలం దగ్గరలోనే ఉన్నట్టు అనిపిస్తున్నది.

ఇదివరకటి కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చింది. పంట భూములకు నీటి సౌకర్యం కోసం ఎంతో కృషిచేసింది. 2014 నుంచి వివిధ నీటి పారుదల ప్రాజెక్టుల కోసం రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసింది. దానివల్ల పంటల వైవిధ్యం, విస్తీర్ణం పెరిగింది. 2014లో 62 లక్షల ఎకరాలకు సాగు నీరందితే 2023 నాటికి ఆ విస్తీర్ణం కోటి 35 లక్షల ఎకరాలకు పెరిగింది. అంటే కొత్తగా 70 లక్షల ఎకరాలకు కొత్తగా నిర్మించిన 24 ప్రాజెక్టుల ద్వారా నీటి వసతి కల్పించబడింది. వరి దిగుబడి 2014లో 68 లక్షల మెట్రిక్ టన్నులుంటే 2023 నాటికి 2 కోట్ల 49 లక్షల టన్నులకు చేరింది. గ్రౌండ్ వాటర్ లెవెల్ 56 శాతం పెరిగింది. నిజానికి గత పదేండ్లలో సాధించిన వ్యవసాయ ప్రగతి ఇంకా ముందుకుసాగాలి. దీనికి భిన్నంగా పరిశ్రమలకు ఆ నేలను వినియోగిస్తే ఇంత ఖర్చు, శ్రమ వృథా అయిపోతాయి.

పంట చేలు కాకుండా ప్రభుత్వం దగ్గర ఉన్న అదనపు భూములను పరిశ్రమలకు కేటాయించాలి. ముందుగా దాని లెక్క తేలాలి. ఆ విస్తీర్ణం, సౌకర్యాలు దృష్టిలో పెట్టుకొనే ఈ ఒప్పందాలు చేసుకోవాలి. రైతుల అధీనంలో పంటలకు వీలుకాని చౌడు భూములేమైనా ఉండే వారి అంగీకారంతో వాటిని సేకరించాలి. కోరుకున్న ధర, పిల్లలకు ఉద్యోగాలు అనే భ్రమలు కల్పించి లేదా బెదిరించి భూములు తీసుకుంటే రైతులు కొత్త కష్టాల్లో చిక్కుకుంటారు. నివాస భూమి, సాగు, ఉద్యానం, అడవి ఇలా భిన్న అవసరాల కోణంలో నేలను విభజించి పరిశ్రమలకు వీలుగా ఎంత లభ్యత ఉన్నదో సర్వే చేయాలి. ఒకవేళ ప్రభుత్వం వద్ద ఇప్పటికే ఆ గణాంకాలుంటే బయటపెట్టాలి. ఒప్పందాలు చేసుకొని వచ్చి మీ భూములు కావాలని రైతులపై ఒత్తిడి తెస్తే లగచర్ల తిరుగుబాటు అంతటికి విస్తరించవచ్చు.

పరిశ్రమలకు రవాణా, నీరు, వనరుల లభ్యత ప్రధాన అవసరాలు. నగరం చుట్టూ ఉన్న భూములనే పారిశ్రామికవేత్తలు కోరుకుంటారు. అందుకు హైదరాబాద్ చుట్టూ ఉన్న వందల గ్రామాలు ఖాళీ చేయించి వారిని దూర ప్రాంతాలకు తరలించే పరిస్థితి రావద్దు. అందుకు వారు ఒప్పుకొనే అవకాశం లేదు. ఒప్పుకొన్నవారికి నగరం మార్కెట్ ధర ప్రకారం వారికి పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ భూమిని ఇవ్వవలసి వస్తుంది. సాగు, నివాసం కొత్తగా ఏర్పాటు చేయాలి. నగరం చుట్టూ పరిశ్రమలు విస్తరిస్తే కాలుష్యం పెరుగుతుంది. ఇప్పటికే వాహన విష ఉద్గారాలతో నగరజీవుల ఆరోగ్యం దెబ్బతింటున్నది. ఫోర్త్ సిటీని నెట్ జీరోగా ఉంచితే మిగతా మూడు నగరాల ప్రజల పరిస్థితి మరింత దిగజారుతున్నది. దానికి ప్రత్యామ్నాయాలు సర్కారు ఏర్పాటుచేయాలి.

పంట భూములన్నీ పరిశ్రమలకు కట్టబెట్టి, రైతు కుటుంబాలను రోడ్డున పడేయడం అభివృద్ధి కాదు. ఆ పరిశ్రమల్లో కుటుంబానికి ఒక ఉద్యోగం ఇచ్చినా.. అదేదో వాచ్‌మెన్ లాంటిదే ఉంటుంది. ఎందుకంటే, ఆ పరిశ్రమలకు అవసరమయ్యే నైపుణ్యాలు గల వాళ్లు ఆ కుటుంబాల్లో ఉండరు. ప్రైవేట్ రంగానికి ఎప్పుడూ సొంత ప్రయోజనాలే ప్రధానం. ఇచ్చిన మాట నిలుపుకోదు. అనంతపురంలోని కియా కార్ల ఫ్యాక్టరీ భూములు కోల్పోయినవారికి ఉపాధి కల్పించకుండా ఇప్పటికీ తిప్పుకొంటున్నట్టు వార్తలు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా కంపెనీ ఉద్యోగాల విషయానికొస్తే ఉద్యోగ భద్రత అసలే ఉండదు. పని గంటలు వారిష్టమే. మన కార్మిక చట్టాలు, ఉద్యోగ సంఘాలు అక్కడ చెల్లవు. కంపెనీ ఉద్యోగం అనగానే సంబురపడేంత సీనేమీ అక్కడ లేదు.

ఒకప్పుడు నగరం చుట్టూ పండ్ల తోటలు, కూరగాయలు, పూల సాగు ఉండేది. ఇప్పుడు వందల కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్నాయి. ఇప్పటికే హైదరాబాద్ చుట్టూ ఉన్న ఎన్నో గ్రామాల వ్యవసాయ భూములు ఐటీ పరిశ్రమలకు ధారాదత్తమయ్యాయి. వాటివల్ల గ్రామీణులకు దక్కింది కూలి బతుకే. చెన్నై, ముంబై మాదిరిగా హైదరాబాద్ పారిశ్రామిక కేంద్రంగా మారితే భాగ్యనగర శోభ నే మంట గలిసిపోతుంది. నగర పచ్చదనం, చుట్టూ అడవి, పంటలు కోటి మందికి ప్రాణవాయువును అందిస్తున్నాయి. అంతకుమించి ప్రయోజనం ప్రజలు ఆశించడం లేదు. దావోస్‌లో జరిగిన డబ్ల్యూఈఎఫ్ వార్షిక సదస్సుకు మన దేశం నుంచి మూడు రాష్ట్రాల సీఎంలే పాల్గొన్నారు. తెలంగాణ, ఏపీతో పాటు మహారాష్ట్ర ఇందులో ప్రాతినిధ్యం వహించింది. దేశంలోని మిగతా రాష్ట్రాల పెద్దలు ఈ సదస్సులకు ఎందుకు వెళ్లలేదు, వెళ్తే వారికి కూడా ఒప్పందాలు దొరికేవి కదా! సాగు భూమి రక్షణ, కాలుష్య నియంత్రణ ముఖ్యం అనుకొనేవారు సమతుల్యతను పాటిస్తారు. అది నేటి తెలంగాణ అవసరం.



పేదల లోన్లు ఎందుకు మాఫీ చేయరు?

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బిలియనీర్లకు కొమ్ము కాస్తున్నది. సాధారణ ప్రజలు తమ సంపాదనలో సగం పన్నుల రూపంలో చెల్లిస్తుంటే.. ఆ సొమ్ముతో కార్పొరేట్ల రుణాలను కేంద్రప్రభుత్వం మాఫీ చేస్తున్నది. పేద, మధ్యతరగతి ప్రజలు తీసుకున్న హోం లోన్, కారు లోన్, ఇతర రుణాలను ఎందుకు మాఫీ చేయడం లేదు?

-అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి

రాష్ట్రంలోని నిరుద్యోగ యువకులు కొలువుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కొలువులీరి ఏడాది గడిచిపోతున్నా వారి ఆశలు మాత్రం ఇంకా నెరవేరడం లేదు. అధికారంలోకి వస్తే ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పటివరకు కనీసం 20 వేల ఉద్యోగాలను కూడా భర్తీచేయలేకపోయింది. ఇదిలా ఉంటే ప్రభుత్వం మాత్రం ఇప్పటికే 55 వేల ఉద్యోగాలు భర్తీచేశామని చెప్పకోవడం నిజంగా సిగ్గుచేటు.

ఉద్యోగాల భర్తీపై నిరుద్యోగుల భ్రమ!

శ్రవణ్ కుమార్
నిరుద్యోగి

కాంగ్రెస్ నాయకులు ఇంత పచ్చిగా అబద్ధాలు చెప్తారని నిరుద్యోగులు ఊహించలేకపోయారు. పదవిలో కూర్చుంటే ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారనుకున్నారు. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాళ్ల అసలు రంగు బయటపడింది. సీఎం రేవంత్ పదే పదే చెప్తున్న 55 వేల ఉద్యోగాల చరిత్ర ఏమిటో పరీక్ష రాసిన నిరుద్యోగులకు, పరీక్ష పెట్టిన ప్రభుత్వానికీ తెలుసు. ఉద్యోగాల భర్తీ ఏమైందని ప్రశ్నిస్తే చాలు రాష్ట్రం అప్పులమయంలో కూరుకుపోయిందని, ఎస్సీ వర్గీకరణ అంటూ కావాలనే కాలయాపన చేస్తున్నది. అందుకే ప్రభుత్వ తీరుపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఉద్యోగాల భర్తీ విషయంలో ఎస్సీ వర్గీకరణ అడ్డంకి కాదని, అమలుచేస్తామన్న ఏపీ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. జాబ్ క్యాలెండర్ అమలు, ఉద్యోగాల భర్తీ విషయంలో ఏపీలో రాని అడ్డంకి తెలంగాణలో ఎందుకు వస్తున్నదో అర్థం కావడం లేదు.

నిరుద్యోగులంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంత చిన్నచూపా? అప్పులతో పోలుస్తూ నిరుద్యోగుల జీవితాలను నాశనం చేయడం కరెక్టేనా? రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పదవీ విరమణ వయస్సు పెంపు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఆ దిశగా అడుగులు వేస్తే మాత్రం నిరుద్యోగుల ఆశలు అడియాసలైనట్టే లెక్క! ప్రభుత్వం ఇచ్చిన ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల భర్తీ హామీని నెరవేర్చకుండా రిటైర్మెంట్ వయస్సు పెంచుదామనుకోవడం సిగ్గుచేటు. ఏండ్ల తరబడి నిరుద్యోగ యువకులు కుటుంబాలకు దూరంగా ఉంటున్నారు. అర్ధాకలితో 5 రూపాయల భోజనం చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. లైబ్రరీల్లో కుర్చీలకు అతుక్కుపోతున్నారు. పరీక్షల కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి సిద్ధమవుతున్న నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం గర్హనీయం. అందుకోసమే, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలపై పోరాటం చేయాలని నిరుద్యోగులు నిర్ణయించుకుంటున్నారు. పేదరికం కారణంగా తల్లిదండ్రులకు ఆర్థికంగా భారం కావద్దనే కారణంతో నిరుద్యోగులు ట్యూషన్లు చెప్తున్నారు. క్యాటరింగ్ పనులు చేసుకుంటున్నారు. కరపత్రాలు పంచుతూ ర్యాపిడో బైక్‌లు నడుపుకొంటూ దయనీయ పరిస్థితుల్లో బతుకీడుస్తున్నారు. రిటైర్మెంట్ తర్వాత ప్రశాంతంగా, హాయిగా, సంతోషంగా కుటుంబసభ్యులతో బతుకాల్సిన వారిని బలవంతంగా ఉద్యోగంలో కొనసాగించాల్సిన అవసరం ఏమున్నది?

**ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిద్రలోంచి మేల్కోవాలి. ఎప్పటికప్పుడు ఖాళీ అయ్యే ప్రతి ఉద్యోగాన్ని భర్తీ చేయాలి. ప్రభుత్వం ఇచ్చే వందల ఉద్యోగాలకు లక్షల మంది నిరుద్యోగులు పోటీ పడుతుండటం, ఆ వందల ఉద్యోగాలను భర్తీ చేయడాన్ని ప్రభుత్వం గొప్పగా భావించడం నిజంగా హేయనీయం. మ